
# అశ్వమేధం

అది లంచ్ టైం. క్లర్కులందరూ క్యాంటీన్‌కి వెళ్ళిపోయారు. హెడ్ క్లర్క్-శ్రీనివాసరావు మాత్రం టేబులు మీద తల ఆనించి నిద్రపోతున్నాడు. అతని ఎదురుగా ఉన్న సీట్లో గౌరి సీరియస్‌గా టైపు చేస్కుంటోంది. కాస్సేపైంది.




శ్రీనివాసరావు పెదాలు మెల్లగా కదలసాగాయి.

"గౌరీ...." గుసగుసలాడుతున్నట్టు మెల్లగా అన్నాడు.

టైపు చేస్కుంటున్న గౌరి ఉలిక్కిపడి చూసింది. శ్రీనివాసరావు కళ్ళు మూసుకునే ఉన్నాడు.

"గౌరీ... రా... వచ్చేయ్... త్వరగా రా గౌరీ... నన్ను నిరాశ పర్చకు...."

గౌరి సర్రున లేచి నిలబడింది.

"ఏయ్ మిస్టర్... ఎవరూ లేకుండా చూసి ఏంటా వాగుడు... వేళాకోళంగా ఉందా?"

"రా గౌరీ, రా...రా.... ఊ.... ముందుకు దూకు... ఛెంగున దూకి రా...." కళ్ళు మూసుకునే అన్నాడు.

ఇలా లాభం లేదని గౌరి విసురుగా ఆఫీసర్ గదిలోకి వెళ్ళింది.

ఆఫీసరు చిదంబరం టేబులు మీద తలవాల్చి కలవరిస్తున్నాడు.

"రోజీ...రా... రా రోజీ..."
గౌరి కంగారు పడింది.
"నేను రోజీని కాదు సార్... గౌరిని!"
"లేదు... నువ్వు రోజీవే... త్వరగా రా రోజీ... చెంగున దూకిరా.... నా అదృష్టదేవతా... రోజీ..."
కళ్ళు మూస్కునే అంటున్నాడు చిదంబరం.
"సార్!..." గట్టిగా అరిచింది గౌరి.
ఉలిక్కిపడి కళ్ళు నులుముకుంటూ లేచి గౌరి వంక చూశాడు చిదంబరం.
"నువ్వొచ్చావా?..."
"మీ స్టైనో రోజీ ఈ రోజు సెలవులో ఉంది సార్..."
"నాతో ఎందుకు చెప్తున్నావు?!" ఆశ్చర్యంగా చూశాడు.
"మీరు రోజీ...రోజీ అని కలవరిస్తున్నారుగా..."
"రోజీనా... హిహిహి.. కలవరించానా?...? రోహోజీ.. రోహోహోజీహి... హిహిహి..."
గౌరి చిక్క మొహం వేసింది.
"సర్లే... నేనెంత నవ్వినా నీ కర్థంకాదుగానీ.... ఎందుకొచ్చావ్?..." నవ్వీ నవ్వీ ఎర్రగా కందిన మొహాన్ని నాప్‌కిన్‌తో తుడుచుకుంటూ అడిగాడు.
"శ్రీనివాసరావుగారు నేను టైపు చేస్కుంటుంటే... గౌరీ... రా.. గౌరీ... రా అని అంటున్నారండీ..."
"హోస్ అంతేనా... ఇంకో లెటర్ టైపింగ్‌కివ్వాలని పిలిచుంటారు... దానికే నా దగ్గరుకొచ్చి కంప్లైంట్ ఇవ్వాలా?"
"కాదండీ... త్వరగారా... నన్ను నిరాశపరచొద్దు అంటూ ఏంటేంటో వాగుతున్నారండీ..." ముక్కు పొంగించి ఆవేశంగా అంది గౌరి.
"ఊహూ..." తల పంకించి బజర్ నొక్కాడు.
ప్యూన్ రంగయ్య లోపలికి వచ్చాడు.
"శ్రీనివాసరావుని పిల్చుకునిరా."
"ఆయన టేబులు మీద పడుకుని గౌరీ...గౌరీ... అని అంటున్నారండీ..."
"చూశారా చూశారా... నేచెప్పానా?" అంది గౌరి.
"లేపి తీసుకురా..." అన్నాడు చిదంబరం.
అయిదు నిమిషాల తర్వాత శ్రీనివాసరావు గదిలోకి వచ్చాడు.
"రావోయ్ రా... కూర్చో... ఏంటి నాటకాలాడ్తున్నావట?" అన్నాడు చిదంబరం.

"నాటకాలా?... ఇప్పుడెక్కడ సార్...? ఎప్పుడో నేను కాలేజీలో చదివే రోజుల్లో నాటకాలాడేవాడిని సార్..." అన్నాడు చిదంబరం ఎదురుగా కూర్చుంటూ.
గౌరి "హు" అంది. "చూశారా నాటకాలు?"
"నువ్వు ఈ అమ్మాయిని తెగ కలవరిస్తున్నావట?" బట్టతల నిమురుకుంటూ అడిగాడు చిదంబరం.
"నేనా... హవ్వ.. లేద్సార్... నిజం... మీమీదొట్టు" లేచి నిలబడి చిదంబరం తలమీద అరచేతిని ఉంచాడు శ్రీనివాసరావు. బట్టతల నునుపుకి అతని అరచేయి జర్రున తలమీంచి చిదంబరం మొహం మీదికి జారిపోయింది.
"అర్రె...!"
మళ్ళీ చిదంబరం తలమీద చెయ్యిపెట్టాడు. మళ్ళీ చెయ్యి జర్రున జారిపోయింది.
"అర్రెర్రె...భలే నున్నగా ఉందే!!!"
మళ్ళీ చెయ్యిపెట్టాడు. మళ్ళీ జారిపోయింది.
"స్టాపిట్!... ఏంటే బుర్రమీద చేతులు పెట్టడాలు?" గట్టిగా అరిచాడు చిదంబరం.
"మీ నెత్తిన చెయ్యిపెట్టి ఒట్టుపెడ్దాం అనుకుంటుంటే చెయ్యి జారిపోతుంది సార్..." నిరాశగా అన్నాడు శ్రీనివాసరావు.
"నువ్వేమీ ఒట్లెయ్యక్కర్లేదు... అసలు సంగతి చెప్పు... రా గౌరీ...రా గౌరీ... నన్ను నిరాశపర్చొద్దు గౌరీ అని అంటున్నావా లేదా?"
శ్రీనివాసరావు ఘొల్లున నవ్వాడు.
"ఓహోహో... చంపేశారు. మీరంటుంది గౌరి గురించా... సాహ్ ఉహారి...హిహిహి..."
"సంగతి చెప్పకుండా ఏంటా నవ్వు?" గట్టిగా అరిచాడు చిదంబరం.
శ్రీనివాసరావు తన లాల్చీ జేబులోంచి ఒక చిన్నసైజు పుస్తకంతీసి చిదంబరానికి చూపించి "నేను కలవరిస్తుంది ఏంటో అర్థం అయింది కద్సార్?... నిజంసార్ మీ మీదొట్టు.అర్రె... మళ్ళీ చెయ్యి జారిపోయింది..."
చిదంబరం నోరు తెరుచుకుని ఆశ్చర్యంగా చూశాడు.
"అర్రె!... నీకు కూడా ఈ పిచ్చి ఉందా?... మరి ఇన్నాళ్ళూ చెప్పలేదేమోయ్..." అంటూ టేబులు సొరుగులాగి అందులోంచి శ్రీనివాసరావు చూపించిన పుస్తకం లాంటిదే నాలుగైదు తీసి టేబులు మీద పెట్టాడు.

అవి రేసు పుస్తకాలు!

"ఇకనేం... మనం చాలా విషయాలు డిస్కస్ చేసుకోవచ్చు... ఇంతకీ ఈ వారం నువ్వు గౌరిమీద కాయదల్చుకున్నావా?" కుతూహలంగా అడిగాడు చిదంబరం.

"అవున్సార్...గౌరి తప్పకుండా వస్తుంది!"

"నేన్రాను.. మీరెన్నిసార్లు పిల్చినా రాను."

గట్టిగా అరిచింది గౌరి.

"నేనంటుంది నీ గురించి కాదు" అన్నాడు శ్రీనివాసరావు గౌరిమీద విసుక్కుంటూ.

"నేననుకోవడం గౌరి ఈసారి రాదనోయ్..." అన్నాడు చిదంబరం.

"మీరు కరెక్టు సార్" అంది గౌరి.

"ఈ సారి రోజీయే వస్తుంది!" అన్నాడు చిదంబరం.

"రోజీకూడా రాదు. ఏం?... ఆ అమ్మాయి మాత్రం తేరగా దొరికిందా?" అంది గౌరీ కోపంగా...

"అమ్మా మహాతల్లీ... మేం మాట్లాడుతుంది మీ గురించి కాదమ్మా... నువ్వు కాస్త నోరు మూసుకో..."

"కానీ మీరు గౌరి రాదని ఎందుకంటున్నారు?"

"గౌరీమీద ఈసారి పదికేజీల బరువు పెంచవచ్చు."

"అయినా గౌరే వస్తుంది. అసలు గౌరి పుట్టుపూర్వోత్తరాలు మీకు తెలుసా?... గౌరి తండ్రి ఎవరనుకున్నారు? బ్లాక్ కింగ్!... యమస్పీడుగా పరుగెత్తేవాడు..."

గౌరి కిసుక్కున నవ్వింది.

"మా నాన్న పేరు భాస్కర్... బ్లాక్ కింగ్ కాదు. మా నాన్న పరిగెత్తడమేంటి... లావు శరీరంతో పెద్ద బొజ్జతో నడవడానికే ఆయాసపడ్తాడు మా నాన్న.."

చిదంబరం, శ్రీనివాసరావులు విసిగిపోయి ఏకకాలంలో తమ తమ బుర్రలను టేబులు కేసి కొట్టుకున్నారు.

"నీకెన్నిసార్లు చెప్పాలి?... మేం మాట్లాడుతుంది మీ గురించి కాదు - గౌరి, రోజీ అనే గుర్రాల గురించి.. నువ్వు నీ సీట్లోకెళ్ళి పని చూసుకో..." అన్నాడు చిదంబరం.

గౌరి లేచి వెళ్ళిపోయింది.

"ఈసారి ఎలాగైనా మనం జాక్‌పాట్ కొట్టాలి. ఇద్దరం కలిసి బాగా స్టడీ చేసి బోలెడన్ని కాంబినేషన్స్ వేయాలి!"
"అలాగే సార్" అన్నాడు శ్రీనివాసరావు.
ఇద్దరూ రేసు పుస్తకాలు ముందేస్కుని ప్రతి గుర్రం పుట్టుపూర్వోత్తరాలు తిరగేశారు. ఏ గుర్రం ఎప్పుడు పుట్టింది, ఎవరికి పుట్టింది, దాని తల్లిదండ్రులు ఎలా పరుగెత్తేవారు, దానిని పెంచిన వాడెవడు, ఏయే కప్పులు గెలిచింది, దానిని ఎక్కే జాకీ ఎవడు, వాడి బరువెంత, వాడు ఎన్ని కప్పులు సంపాదించాడు మొదలయిన వివరాలన్ని స్టడీ చేశారు. కొన్ని జాక్‌పాట్ నెంబర్లు, కొన్ని ట్రిబుల్ ఈవెంట్ నెంబర్లు, కొన్ని తనాలా నెంబర్లు తయారుచేశారు.
"ఈసారి జాక్‌పాట్ మనదే" అనుకున్నారు ఇద్దరూ.
రేసుకోర్సుకి వెళ్ళే ప్రతి ఒక్కడూ అదే అనుకుంటాడు.
"అవునూ... రేసులాడ్డానికి నీకు డబ్బెక్కడినుండి వస్తుంది?" చిదంబరం అడిగాడు.
"ఏముందిసార్.... అందర్లాగే... మా ఆవిడని చితగతన్ని ఒంటిమీదివి ఒక్కొక్కటే అమ్మేస్తాను... మా ఆవిడ ఒంటిమీద బంగారం అంతా అయిపోయింది. ప్రస్తుతం ఇంట్లోని సామాన్లు అమ్మడం మొదలుబెట్టా..." సిగ్గుపడ్తూ చెప్పాడు శ్రీనివాసరావు..
"అయితే నువ్వూ నాలానే అన్నమాట!... నేనూ ప్రస్తుతం ఇంట్లోని సామాన్లు అమ్ముతున్నాను.." చిదంబరం కూడా సిగ్గుపడ్డాడు.
"అమ్మితే అమ్మాం... జాక్‌పాట్ కొడ్తే అంతకు బోలెడు రెట్లు బంగారం సామానులు కొంటాం - కద్సార్!!!"
"అవునవును... నువ్ చెప్పింది నిజం..."
ఆరోజు సాయంత్రం శ్రీనివాసరావు ఇంటికి వెళ్ళి రేసులాడ్డానికి భార్యని మంగళసూత్రం అడిగాడు.
"మంగళసూత్రమా?!... అది పోయినవారం రేసుల కోసం అమ్మేశారుగా?!..."
మెళ్ళోని పసుపు కొమ్ము తీసి చూపిస్తూ అంది భార్య పద్మావతి.
"ఇంకేం అమ్మడానికి లేవా యింట్లో?"
"ఏమున్నాయ్... నేనొక్కదాన్ని ఉన్నాను... నన్నమ్మండి..."
"సీ సంగతి ఆఖర్న చూస్తాలే... తలుపేస్కో" అంటూ పక్కింటికి వెళ్ళాడు.
"ఏంటోయ్ ఇలా వచ్చావ్?" అన్నాడు పక్కింటి సుబ్బారావు.

"రేసులాడ్డానికి వెళ్తున్నాగానీ మీ ఆవిడ మంగళసూత్రం ఓమారు ఎరువిస్తావా?... జాక్‌పాట్ కొట్టిన తరువాత తాకట్టు విడిపించి మీ మంగళసూత్రం మీకిచ్చేస్తాను" అన్నాడు శ్రీనివాసరావు ఉత్సాహంగా.
శ్రీనివాసరావు మొహం మీద తలుపు మూశాడు సుబ్బారావు.
శ్రీనివాసరావు ముక్కు చితికింది.
ఏం చెయ్యాలో పాలుపోని శ్రీనివాసరావు, నిజాయితీపరుడైన శ్రీనివాసరావు, రేసుల్ని వదలుకోలేని శ్రీనివాసరావు ఆఫీసులో అవినీతికి పాల్పడటం మొదలుపెట్టాడు. లంచాలు కొట్టడం బాగా అలవాటు చేస్కున్నాడు. కొన్నాళ్ళకి లంచాల డబ్బుకూడా సరిపోవడంలేదు అని గ్రహించాడు.
అప్పుడు బ్రిలియంట్ అయిడియా వచ్చి, ఓ కత్తెర కొనుక్కొని సాయంకాలం పూట పార్టుటైం జాబ్‌గా జేబులు కత్తిరించడం మొదలు పెట్టాడు. దొరికిన చోటల్లా అప్పులు చేశాడు. ఎన్ని చేసినా, ఎంత ఖర్చుపెట్టినా, ఎంతకాలం గడిచినా జాక్‌పాట్ తగల్లేదు.
కానీ... లంచం తీస్కుంటుండగా ఎ.సి.బి. వాళ్ళు, జేబులు కొట్టినందుకు పోలీసోళ్ళు మాత్రం శ్రీనివాసరావుని పట్టుకున్నారు.
ప్రస్తుతం శ్రీనివాసరావు జైల్లో తన సెల్‌లో గోడలమీద గుర్రాల బొమ్మలు వేస్కుంటూ కాలక్షేపం చేస్తున్నాడు.
ఇలాంటి శ్రీనివాసరావులు మన దేశంలో చాలామంది ఉన్నారు.

* * *